

ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి అనర్హత వేటు తప్పదా..?



● వైసీపీ శ్రేణుల్లో మొదలైన ఆందోళన

పుంగనూరు, జూలై 28: హైకోర్టులో బుధవారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత వేటుకు సంబంధించి సింగల్ బెంచిలో జస్టిస్ వి.శ్రీనివాస్ విచారణ చేపట్టడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన శాఖలకు మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలకంగా రాయల సీమ, రాష్ట్రంలో అధికారాన్ని శాసించారు. అడ్డు అదుపులేకుండా కనుసైగతో ప్రతిపక్షాలకు చుక్కలు చూపించారు. ఎన్నికలకు వారం రోజుల ముందే జూన్ 7వ తేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ అఫిడవిట్‌లో ఆయనతో బాటు వారి సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలత పేర్లతో ఉన్న 142 ఆస్తులను పేర్కొన కుండా దాచారని ఆయనను పోటీకి అనర్హుడిని చేయాలని రామచంద్రయాదవ్ రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి, గవర్నర్, వివిధ ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. అయినా, పెద్దిరెడ్డికి ఏ ఆటంకం లేకుండా పోటీ చేసి గెలిచారు. ఈ క్రమంలో తాను గెలవకపోయినా పర్వాలేదు.. పెద్దిరెడ్డిని ఎమ్మెల్యే పదవి నుంచి తప్పించాలని ఈనెల నాలుగోతేది హైకోర్టులో రామచంద్రయాదవ్ కేసు దాఖలు చేశారు. హైకోర్టు ఈపీ నెంబరు 3/2024 మేరకు విచారణకు స్వీకరించింది. బుధవారం జడ్జి శ్రీనివాస్ విచారించి తర్వాత ఈనెల 30వ తేదికి వాయిదా వేశారు. హైకోర్టు కేసుకు నెంబరు కేటాయించి, న్యూట్రిని అధికారిని నియమించడం, విచారణలు వేగవంతం చేయడంతో పెద్దిరెడ్డి ఈకేసులో తప్పించుకోలేరని పలువురు చెబుతున్నారు. గతంలో అధికారం ఉండటంతో తప్పించుకునే వారని, నేడు టీడీపీ కూటమి అధికారంలో ఉండటంతో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, తదితర జిల్లాల్లోని 142 ఆస్తులు వివరాలకు సంబంధించిన రికార్డులు కోర్టుముందు ఉండటంతో పెద్దిరెడ్డి వీరభక్త అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

నాడు సుప్రీంకోర్టు వరకు..

2014లో ఎన్నికల్లో పుంగనూరు వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. టీడీపీ అభ్యర్థి ఎం.వెంకటరమణరాజుపై గెలుపొందారు. అప్పుడు కూడా ఇదే తరహాలో ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో పెద్దిరెడ్డి కొన్నిచోట్ల సంతకాలు చేయలేదని, కోట్ల రూపాయల ఆస్తులు వివరాలు చూపలేదని, సరైన పత్రాలు పొందుపరచలేదని, పీఎల్ఆర్ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన భార్య స్వర్ణలతను గృహిణిగా చూపారంటూ టీడీపీ అభ్యర్థి రాజు హైకోర్టును ఆశ్రయించగా ఈపీ నెంబరు 8/2014 కేసు నమోదైంది. 2016 ఆగస్టులో హైకోర్టు జడ్జి దుర్గాప్రసాద్ ప్రిలిమనరి ఫీడింగ్ సరిగాలేదని కేసును డిస్మిస్ చేశారు. 2016 అక్టోబరులో వెంకటరమణ రాజు మళ్లీ సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాదులు సిద్ధార్థలూద్రా, ఆనంద్, కేఎస్ మదన్ ద్వారా పిటిషన్ వేయగా సివిల్ అప్పీల్ నెంబరు 9466, 9467, 9468 ప్రకారం సుప్రీంకోర్టు కేసు విచారణకు స్వీకరించింది. సుప్రీంకోర్టులో ఈ కేసుపై 18 మార్లు వాదోపవాదాలు జరిగి తుది తీర్పు రిజర్వులో ఉంచింది. తర్వాత వెంకటరమణ రాజును తొలగించి ఆస్థానంలో అనీషారెడ్డిని టీడీపీ ఇన్‌చార్జిగా నియమించడం, వివిధ కారణాలతో ఆయన కేసుపై ఆసక్తి చూపకపోవడంతో పెద్దిరెడ్డి అనర్హత వేటు కేసు మూతపడింది. తర్వాత ఈ ఎన్నికల్లో మళ్లీ రామచంద్రయాదవ్ హైకోర్టులో కేసు వేశారు. పెద్దిరెడ్డి తర్వాత అత్యధిక ఓట్లు వచ్చిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని కూడా ఈ కేసులో భాగస్వామిని చేసేలా నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఈ కేసులో పిటిషనరుకు అనుకూలంగా తీర్పు వస్తే.. తర్వాత అత్యధిక ఓట్లు సాధించిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా కోర్టు ప్రకటించే అవకాశాలున్నాయి.

సీఎం కుటుంబంపై అసభ్య పోస్టులు

● వైసీపీ కార్యకర్తపై పోలీసులకు ఫిర్యాదు

కుప్పం, జూలై 28: సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఆయన కోడలు బ్రాహ్మణిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌పైనా పోస్టింగులు పెట్టారు. కుప్పం మండలం నూలుకుంటకు చెందిన తిరు అమ్ము పేరిట సోషల్ మీడియాలో ఈ పోస్టులు పెట్టారు. వాటిని గమనించిన టీడీపీ సోషల్ మీడియా వింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆగస్టు నుంచి పంచదార సరఫరా

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28: ధరలు మండుతున్నా కొన్ని నిత్యావసర సరుకులను పేదలకు చౌకగా అందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు నుంచి కార్డుదారులకు బియ్యంతో పాటు అరకిలో పంచదార అందజేయాలని నిర్ణయించింది. జిల్లాలో 5.45 లక్షల కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. 8500 టన్నుల బియ్యం, 270 టన్నుల పంచదార పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలను సిద్ధం చేసింది. ఈనెలలో రైతు బజార్ల ద్వారా సన్నరకం బియ్యం, కందిపప్పు అందించడంతో పట్టణ పేద ప్రజలకు ఊరట కలుగుతోంది సెప్టెంబరు నుంచి కందిపప్పు పంపిణీ చేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద గంటపాటు ఉద్రిక్తత



41ఏ నోటీసు చూపుతున్న మోహిత్‌రెడ్డి

● తిరుపతికి ఉదయం 6.50 గంటలకు మోహిత్‌రెడ్డి తరలింపు
● పోలీసుల ప్రశ్నలకు సహకరించని వైనం!
● 41ఏ నోటీసు ఇచ్చి.. 8.05గంటలకు షరతులతో విడుదల



ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28: ఎస్వీయూ పోలీసు స్టేషను వద్ద ఆదివారం ఉదయం గంటా 15 నిమిషాలపాటు ఉద్రిక్తత నెలకొంది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని తీసుకొచ్చిన సందర్భంగా అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే.. నాటి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై జూలై 14న జరిగిన హత్యాయత్నం కేసులో వైసీపీ అభ్యర్థి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి నిందితుడు. తండ్రి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సోదరుడు హర్షిత్‌రెడ్డితో కలసి శనివారం రాత్రి దుబాయ్ వెళ్లడానికి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో వేచి ఉన్న మోహిత్‌ను అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో 10 వాహనాలు.. 70 మంది పోలీసు భద్రత నడుమ చెవిరెడ్డి, ఆయన ఇద్దరి కుమారులను ఉదయం 6.50 గంటలకు తిరుపతిలోని ఎస్వీయూ పోలీసు స్టేషనుకు తీసుకొచ్చారు. మోహిత్‌రెడ్డి ఒక్కరినే స్టేషనులోకి తీసుకెళ్లారు.ఈ ఘటనతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. విచారణలో భాగంగా పోలీసులు మోహిత్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ, విచారణలో ఆయన ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసలు తప్పు చేయకుంటే దుబాయ్‌కి ఎందుకు తప్పించుకుని వెళుతున్నారని.. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని అడిగినట్లు సమాచారం. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాట వేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం 41ఏ నోటీసులిచ్చారు. ఎప్పుడు విచారణకు పిలిచినా రావాలని, స్థానికంగా అందుబాటులో ఉండాలని షరతులు విధించారు. అయితే మోహిత్‌రెడ్డి మాత్రం 'అరెస్టు చేయండి.. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచండి' అంటూ కొంతసేపు మొరాయించి కూర్చొన్నట్లు తెలిసింది. తద్వారా సానుభూతి పొందే ప్రయత్నం చేశారన్న వ్యాఖ్యలు వినిపించాయి. పోలీసులు మాత్రం 41ఏ నోటీసు ఇచ్చి 8.05 గంటలకు ఆయన్ను బయటకు పంపారు.

కాగా, ఉదయం ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద సివిల్, రిజర్వు, ఎస్టీఎఫ్ పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల వాహనాల రాకపోకలను నియంత్రించారు. ఎస్వీయూ స్టేషన్ చుట్టూ ఎవరినీ అనుమతించలేదు. పద్మావతి అతిథి గృహం సిబ్బందినీ లోపలకు పంపలేదు.

బెడిసికొట్టిన 'వ్యూహం'!

పోలీసు చర్యలతో సానుభూతి పొందాలన్న వైసీపీ వ్యూహం బెడిసి కొట్టిందా? ఈ ప్రశ్నకు రాజకీయవర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. మోహిత్‌రెడ్డి అరెస్టయితే చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టేందుకు శ్రేణులను సిద్ధం చేసుకున్నారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకునేలా చర్యలు చేపట్టారు. కానీ, పోలీసు అధికారులు ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకూ విచారణకు అందుబాటులో ఉండాలంటూ 41ఏ నోటీసు ఇచ్చి పంపేశారు. దీంతో ఏం చేయాలో తోచక వైసీపీ వర్గాలు గందరగోళంలో పడ్డాయి. నియోజకవర్గవ్యాప్తంగా కూడా ఉద్రిక్తతలకు అవకాశం లేకుండా పోయింది.

చెవిరెడ్డి నిరసన



ఎస్వీయూ వర్సిటీ వద్ద ఫుట్‌పాత్‌పై అనుచరులతో కలిసి చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిరసన చేపట్టారు. ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేని మోహిత్‌ని రెండు నెలల తర్వాత ఏ37గా చేర్చి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ప్రజా పోరాటాలు ఎలా ఉంటాయో ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు రుచి చూపిస్తామని హెచ్చరించారు. తీవ్రవాది, ఆర్థిక ఉగ్రవాదికి ఇచ్చినట్లు లుక్‌అవుట్ నోటీసు జారీ చేసి ఇప్పుడు 41ఏ నోటీసుతో వదలి పెట్టడం ఈ ప్రభుత్వ దుర్మార్గపుతనానికి నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వానికి, పోలీసులకు దమ్ముంటే ఆధారాలతో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలని డిమాండు చేశారు. చంద్రగిరి మండలం కూచువారిపల్లెలో తమ రెండు కార్లు, సర్పంచి ఇల్లు దహనం, తమ శ్రేణులపై దాడి చేసిన కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నాని కారుపై దాడి జరిగిన మాట వాస్తవమన్నారు. నానిపై 37 మంది దాడి చేసుంటే ఆయనకు ఎందుకు చిన్నగాయం కూడా తగల్లేదన్నారు. స్విమ్స్ నివేదికలే దీనికి సాక్ష్యమన్నారు. నానీపై తాను దాడి చేయలేదని కాణిపాకం లేదా ఏ దేవుడి వద్దనైనా ప్రమాణం చేయడానికి సిద్ధమని మోహిత్‌రెడ్డి తెలిపారు. నానీ అవినీతి, భూదందాలు, గ్రానైట్ అక్రమాలు, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటాలు చేస్తామన్నారు. భయపెట్టి పాలన చేయాలంటే ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు.

తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదు: నాని

తిరుచానూరు: తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన దాడుల విషయం ప్రతిది మీడియాకు తెలుసన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చెవిరెడ్డికి భంగపాటు తప్పదన్నారు. 'చట్టాన్ని నా చేతిలోకి తీసుకుని శిక్షించడానికి, తప్పుడు కేసులు పెట్టడానికి రెండు నెలలు ఎదురు చూడాల్సిన పని లేదు. ఎన్నికలకు ముందు ప్రధాన నిందితుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేరు చెప్పాను. విచారణలో నిందితులు మీ పేరు ఎందుకు చెప్పారో తెలుసుకోండి. పోలీసుల విచారణలో భాగంగా మోహిత్‌రెడ్డిని 37వ నిందితుడిగా చేర్చారు. ప్రజలకు తప్పుడు సమాచారం... తప్పుడు సంకేతం ఇవ్వడం మానుకోవాలి. విదేశాల్లో చదివినా హత్యాయత్నం చేసిన వారికి శిక్ష తప్పదు' అని పులివర్తి నాని వ్యాఖ్యానించారు. చంద్రగిరి అభివృద్ధికే సమయం చాలని తాను.. చెవిరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు సమయం ఎక్కడుందన్నారు.



రమేష్‌చంద్ర ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ తదితరులు

గంధమనేనికి కన్నీటి వీడ్కోలు

● టీడీపీ నేతల నివాళులు ● ఫోన్‌లో కుటుంబీకులకు సీఎం పరామర్శ



చంద్రబాబుతో ఫోనులో మాట్లాడుతున్న రాజేష్

నింద్ర, జూలై 28: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్రప్రసాద్‌కు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారం ఆయన రమేష్ చంద్ర ప్రసాద్ కుమారుడు రాజేష్‌తో ఫోనులో మాట్లాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రమేష్ చంద్ర భౌతిక కాయానికి పలమనేరు, చంద్రగిరి, పూతలపట్టు, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తినాని, మురళీమోహన్, భానుప్రకాష్, ఆదిమూలం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనుభవం కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. తమ రాజకీయ ఎదుగుదలలో ఆయన పాత్ర ఉందని గుర్తు చేసుకున్నారు. గ్రామస్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకులందరితో మంచి సంబంధాలున్న నాయకుడని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, కందేరి జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ నాయుడు, మోహన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర నాయకులు పోతుగుంట విజయబాబు, ఆర్‌సీ మునికృష్ణ, నాగేంద్రనాయుడు, శ్రీధర్‌బాబు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్‌తోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది తరలివచ్చారు.



నివాళులర్పిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూలై 28: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని కొత్త సమావేశపు మందిరంలో జరుగుతుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిస్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు.

మాస్కుతో వచ్చి.. కత్తితో బెదిరించి..!

● 92 గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లిన దుండగుడు

కల్లూరు, జూలై 28: వేకువజామున ఇంటి బయటకు వచ్చిన మహిళను కత్తితో బెదిరించి నగలు లాక్కెళ్లాడో దుండగుడు. ఈ ఘటన పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కల్లూరులోని పుంగనూరు రోడ్డులో మధుసూదన్ భార్య స్రవంతి ఆదివారం వేకువజామున 4 గంటలకు చెత్తను పడేసేందుకు ఇంటి సమీపానికి వచ్చారు. అదే సమయంలో ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజు వేసుకొని వచ్చిన దుండగుడు కత్తితో బెదిరించాడు. ఆమె మెడలోని 28 గ్రాముల బొట్టుచైను, రెండు చేతుల్లోని 56 గ్రాముల 4 గాజులు, 8 గ్రాముల రెండు ఉంగరాలు లాక్కెళ్లాడు. ఈ ఘటన నుంచి తేరుకున్న ఆమె ఇంటికెళ్లి సమాచారం ఇచ్చారు. భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దండగుడు బంగారు నగలు దోచుకెళ్లిన తీరుపై బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. చోరీకి గురైన 92 గ్రాముల బంగారు నగల విలువ రూ.5లక్షలు ఉంటుందన్నారు. స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాధితురాలు స్రవంతిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ, సీఐ

ఇద్దరు విద్యుత్ ఏఈలపై వేటు

చిత్తూరు రూరల్, జూలై 28: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ శాఖలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఏఈలపై ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు వేటు వేశారు. ఇందులో పెనుమూరు ఏఈ నీరజ, తిరుపతి జిల్లా అవిలాల ఏఈ నాగరాజు ఉన్నారు. వీరిద్దరు 2019-20 సంవత్సరానికి చెందిన వర్క్‌ఆర్డర్లను ఇప్పటికీ క్లోజ్ చేయలేదు. దీనిపై పలుమార్లు హెచ్చరించినా పనులు పూర్తి చేయలేదు. దీంతో క్రమశిక్షణా చర్యల కింద వారిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించినట్లు ఆయన తెలిపారు. పెనుమూరు ఏఈ స్థానంలో అదే సెక్షన్‌లోని సబ్ ఇంజనీరు తులసికి, అవిలాల ఏఈ స్థానంలో తిరుపతి ఆపరేషన్ సెక్షన్ ఏఈ శ్రీనివాసులు నాయుడుకు బాధ్యతలు అప్పగించారు.

ఫైళ్ల దహనం వెనుక ఎంతటివారున్నా అరెస్టు చేయాలి

● తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్

మదనపల్లె టౌన్, జూలై 28: మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనలో ఎంతటి వారినైనా అరెస్టు చేయాలని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండు చేశారు. ఆదివారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్ద ఆయన పోలీసులతో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రన్నింగ్ ఫైళ్లు ఉంటాయని, అవన్నీ దహనం అయితే వాటిని రికవరీ చేయడానికి కాస్త సమయం పడుతుందన్నారు. ఈ ఆరురోజుల్లో ఈ కేసును ఛేదించడంలో పోలీసులు పురోగతి సాధిస్తున్నారని అభినందించారు. కాకుంటే విజయవాడలో పొల్యూషన్‌బోర్డులో ఫైళ్ల దహనం విషయమై ఐఏఎస్ అధికారిని వదిలి వేయడం బాగాలేదన్నారు. ఈ సంఘటనపై కూడా మదనపల్లె తరహాలో చంద్రబాబు ప్రభుత్వం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం చంద్రబాబు కమిషన్ వేయాలని చింతా మోహన్ కోరారు.

జన సైనికుడు ప్రమాదవశాత్తు మృతి

జనసేనాని రూ.5 లక్షలు సాయం



మృతుడి భార్య రాజేశ్వరికి చెక్కును అందజేస్తున్న జనసేన నాయకులు

కల్లూరు, జూలై28: డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్‌కళ్యాణ్ పెద్ద మనసు చాటుకున్నారు. ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లికి చెందిన జనసేన కార్యకర్త వెంకటరత్నం ఈ ఏడాది జనవరి 16న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారి పడి మృతి చెందాడు. జనసేన కార్యకర్తలకు పార్టీ సభ్యత్వంతో పాటు బీమా సౌకర్యం కల్పించింది. దీంతో ప్రమాదవశాత్తు మృతిచెందిన వెంకట రత్నం కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని జనసేనాని పవన్‌కళ్యాణ్ నిర్ణయించి చెక్కును అందజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చిన్నరాయల్ ఆదేశాల మేరకు పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం మృతుడు వెంకటరత్నం భార్య రాజేశ్వరికి రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం జనసేన పార్టీ గౌరవాధ్యక్షులు పోకల జనార్ధన్, మండల అధ్యక్షులు చంద్రబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అండగా ఉంటారనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పుష్పరాజ్, వెంకీ, ధరణి, మనీష్, హరి, సునీల్, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పేరుకే అధికారంలో కూటమి

- వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ
- బీసీవై అధినేత ఘాటు విమర్శ

చిత్తూరు, జూలై 28: రాష్ట్రంలో పేరుకు మాత్రమే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ఇప్పటికీ పోలీసు సహా కీలక వ్యవస్థలు వైసీపీ కనుసన్నల్లోనే ఉన్నాయని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ విమర్శించారు. పోలీసుల తీరు చూస్తుంటే రాష్ట్రంలో జగన్ సీఎంగా, వైసీపీ అధికారంలో ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ఏమైనా లోపాయకారి ఒప్పందాలు, రాజకీయాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు ఉన్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నాయకుడిని బెంగుళూరు ఎయిర్‌పోర్టులో అధికారులు పట్టుకుని రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే 41ఏ నోటీసు ఇచ్చి పంపడం ఏమిటని పేర్కొన్నారు. పుంగనూరులో 10 రోజుల క్రితం ఇరువర్గాలకు జరిగిన ఘర్షణలో ఎంపీ మిథున్ రెడ్డి సహా మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులపై సెక్షన్ 307 కేసులు నమోదైనా, ఇంతవరకు అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అంగళ్ళు అల్లర్లలో చంద్రబాబుతో సహా పార్టీకి చెందిన వందలాదిమందిపై కేసులు పెట్టిన ఎస్పీ గంగాధర్‌ను కృష్ణా జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇవ్వగా అక్కడ ఆయన వైసీపీ మాజీ మంత్రి కొడాలి నానితో కలిసి టీడీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు ఉందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబానికి చెంచాగిరి చేసిన పోలీసు అధికారులను పలమనేరులో కీలక పోస్టింగ్స్‌లో స్థానిక ఎమ్మెల్యే నియమించుకోవడం లోపాయకారి ఒప్పందం కాదా అని ప్రశ్నించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసులో ఫైళ్ళ దహనం కేసులో ప్రధాన నిందితుడిని ఢిల్లీకి సాగనంపింది స్థానిక పోలీసులేనన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలను చూస్తుంటే వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని స్పష్టమౌతోందన్నారు. సాధారణ ప్రజలకు కలుగుతున్న అనుమానాలపై ప్రభుత్వం సమీక్ష చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

వచ్చేనెల్లో 'పెళ్లి కాని ప్రసాద్' విడుదల

- హీరో సప్తగిరి



సప్తగిరి, గురజాల జగన్మోహన్

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను నటించిన 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా ఆగస్టులో విడుదల అవుతుందని హీరో సప్తగిరి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా చూస్తే అందరికి పెళ్లి అవుతుందని నవ్వుతూ అన్నారు. అలాగే ఈచిత్రంతో పాటు 'గోల్డ్‌మెన్' అనే చిత్రంలో కూడా నటిస్తున్నట్టు తెలిపారు. 'పెళ్లి కాని ప్రసాద్' స్క్రిప్ట్ చిత్తూరు ఎమ్మెల్యే ఓకే చేశారన్నారు. ఇక, 'మా' ఎన్నికల గురించి మీడియా ప్రశ్నించగా తప్పకుండా అన్నిటిలో మా ముద్ర ఉంటుందన్నారు. తర్వాత రాజకీయాల ప్రవేశంపై స్పందిస్తూ ఎంపీ సీటు కోసం ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ.. చిన్నపిల్లోడిని అప్పుడే ఎందుకు రాజకీయాలు అని తర్వాత చూద్దాం అనుకున్నట్టు చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఎక్కడికక్కడ తిరుమలలో పరిశుభ్రత పెరగడంతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోందన్నారు. సీఎం ఆదేశాలతో వచ్చిన అధికారులు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఈదేవస్థానాన్ని ఇంకా ఉన్నత స్థానానికి తీసుకువెళతారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

పాత కలెక్టరేట్‌కు పోలీసు భద్రత



చిత్తూరు కలెక్టరేట్, జూలై 28: 'మదనపల్లె' ఘటన నేపథ్యంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చిత్తూరులోని పాత కలెక్టరేట్‌లోని రికార్డు రూమ్‌కు భద్రత లేదంటూ ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టింది. మూడు రోజులుగా రెవెన్యూ పాత రికార్డుల భవనానికి 24గంటలూ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ బురదజల్లేలా వ్యవహరిస్తోంది

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కనీసం గంట కూడా పదవిలో లేకుండా మాజీ సీఎం జగన్ ఉండలేని పరిస్థితిలో ఉన్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 36 మంది వైసీపీ నాయకులను హత్య చేశారని జగన్ ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. ఎవరు చనిపోయారు, వారి పేర్లు చెబితే విచారణ చేయిస్తామని పలుమార్లు సీఎం చెప్పినా సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. కేవలం బురద చల్లేసి కడుక్కోండనే విధంగా జగన్ వ్యవహారం ఉందన్నారు. ప్రభుత్వంలో ఏదైనా లోటుపాట్లు ఉంటే ప్రశ్నించేలా ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో తాము కూడా కౌన్సిల్‌లో అనేక ప్రజా సమస్యలపై ప్రశ్నించామన్నారు. గతంలో టీటీడీలో అనేక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. గతేడాది శ్రీవారి పరకామణిలో వందల కోట్ల కుంభకోణం జరగడం ఇటీవల బయటపడిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చ జరిగినప్పుడు మంత్రి ఆనం విచారణ చేయిస్తానని చెప్పారన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 84,173 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,519మంది తలనీలాలు సమర్పించారు.

వైసీపీ స్వార్థం...ఆ పంచాయతీలకు శాపం

● టీడీపీ కంచుకోటలో గెలవాలని విలీనం.. కోర్టు స్టే ● నిధులు రాక ఆగిన అభివృద్ధి ● కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు

పెనుమూరు, జూలై 28: వైసీపీ నేతల స్వార్థానికి మండలంలోని పెనుమూరు, చార్వాగానిపల్లి, పెద్దకలికిరి పంచాయతీలు బలయ్యాయి. పెనుమూరు, పెద్దకలికిరి పంచాయతీలు టీడీపీకి కంచుకోటగా ఉన్నాయి. గత ఐదు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులే ఇక్కడ గెలుపొందారు. మండల కేంద్రం పెనుమూరులో ఎలాగైనా వైసీపీ జెండా ఎగురవేయాలని భావించిన ఆ పార్టీ నాయకులు పక్కనే ఉన్న చార్వాగానిపల్లి పంచాయతీని అందులో విలీనం చేయాలని భావించారు. అలాగే పెద్దకలికిరి పంచాయతీని రెండుగా విభజించి మొరవకండ్రిగను వేరుచేస్తే కనీసం ఒక్క పంచాయతీ అయినా గెలవచ్చని భావించారు. ఆ మేరకు 2019వ సంవత్సరంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీరాజ్ శాఖకు పంపించారు. మెర్జ్ గెజిట్ వచ్చాక ఈ విషయం ప్రజలకు తెలిసింది. ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు వస్తున్న రోజు కూడా అధికార పార్టీ నాయకులు మాత్రమే పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పంచాయతీల విభజనకు తమకు అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో అధికారులు పంచాయతీ మెర్జింగ్, డివైడింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ప్రొసీడింగ్స్‌ను అన్ని శాఖలకు పంపించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు కోర్టును ఆశ్రయించగా స్టే విధించింది.



కలికిరి సచివాలయం

అభివృద్ధి ఊసే లేని చార్వాగానిపల్లి, పెద్దకలికిరి

చార్వాగానిపల్లి అసలే చిన్న పంచాయతీ.. నిధులు అంతంతమాత్రమే.. ఇక పెనుమూరులో విలీనం చేయడం, కోర్టు స్టే విధించడంతో అభివృద్ధి పనులు ఏవీ జరగలేదు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్, లైబ్రరీ భవనాల లాంటివి మంజూరుకాలేదు. డ్రైనేజీ, రోడ్ల ఊసేలేదు. వీధి దీపాలు కావాలన్నా సచివాలయంలో అడిగితే పెనుమూరులో అడగాలని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ చేసి రెండేళ్లయ్యింది. పెద్దకలికిరి పంచాయతీ పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది.

ఉపాధి, హౌసింగ్ బిల్లులకు బ్రేక్

చార్వాగానిపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో 60 మంది కూలీలు ఉన్నారు. వీరు పనులు చేయాలన్నా పంచాయతీ పేరు చూపకపోవడంతో అధికారులు అంచనా వ్యయం వేయలేకపోతున్నారు. హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలు పెంచుతున్న రైతులకు బిల్లులు ఆరు నెలలుగా పెట్టలేదు. హౌసింగ్‌లో 26 మంది లబ్ధిదారులకు కొంత మొత్తం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. వాటికి కూడా బ్రేక్ పడింది. ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్‌ను ఉద్యోగం నుంచి తీసేశారు.

రూ.కోటి నిధులు వెనక్కు..

కోర్టులో స్టే ఉండటంతో మూడు పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు ఆగిపోయాయి. దీంతో నిధులకు బ్రేక్ పడింది. పెనుమూరు పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి రూ.22 లక్షలు చొప్పున మూడేళ్లకు రూ.66 లక్షలు ఆగిపోయాయి. చార్వాగానిపల్లి పంచాయతీకి ఏడాదికి రూ.5 లక్షల చొప్పున మూడేళ్లకు 15 లక్షలు, పెద్దకలికిరి పంచాయతీకి ఏడాదికి రూ.8.50 లక్షల చొప్పున రూ.25.5 లక్షలు ఆగిపోయాయి. ఈ క్రమంలో ఏ చిన్న అభివృద్ధి పని కూడా అధికారులు చేయలేకపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పంచాయతీల మెర్జింగ్ వ్యవహారంపై దృష్టి సారించి న్యాయం చేస్తుందని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.



చార్వాగానిపల్లి సచివాలయం

వైసీపీ నేత లీలలు?

- ఆర్సీపురం మండలంలోని స్థలానికి తిరుపతి రూరల్‌లో ఫేక్ రికార్డులు
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో రూ.కోటి స్థలం స్వాహా
- న్యాయం కోసం తిరుగుతున్న బాధితుడు

భూమి ఉండేది రామచంద్రాపురం మండలం పరిధిలో అయితే తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైంది. వాటికి రూరల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు. ఫలితంగా రూ.కోటి విలువైన భూమి ఓ వైసీపీ నేత ఖాతాలోకి చేరిపోయింది. ఆలస్యంగా ఈ విషయం భూ యజమానికి తెలిసి కుయ్యోమొర్రోమంటూ రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని వేచిచూశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కుమ్మక్కై వైసీపీ నేతకు తన భూమిని ఎలా కట్టబెట్టారో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో నివసించే కె.పురుషోత్తమ రెడ్డికి రామచంద్రాపురం మండలం సి.రామాపురం గ్రామంలో సర్వే నెంబరు 73/3లో 2.32 ఎకరాల పూర్తి విస్తీర్ణ భూమికి 1959 నుంచి రికార్డు ఉంది. 2022 ఏప్రిల్‌లో అనుమానం వచ్చి కొత్త అడంగల్ పరిశీలించగా 10 సెంట్ల భూమి తగ్గి 2.22 ఎకరాలని చూపించింది. ఖంగుతిన్న బాధితుడు రికార్డులను పరిశీలించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఆర్సీపురం, తిరుపతి రూరల్ మండల ఉద్యోగులు కుమ్మక్కై తన భూమిలోని 10 సెంట్లను వేరే వ్యక్తికి ఇచ్చినట్లు తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ద్వారా జారీ అయినట్లు నకిలీ 1-బీ, అడంగల్ ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించినట్టు గుర్తించారు. ఆ తర్వాత ఈ భూమిని స్థానిక జడ్పీటీసీ డిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేసేశారు. ఆర్సీపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఆర్ఐగా పనిచేసిన జీవన్‌రెడ్డి ప్రధాన సహకారంతో వైసీపీ నేత వి.భానుకుమార్ రెడ్డి ఆ భూమిని తన భార్య డిల్లీరాణి పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఈ లావాదేవీల్లో వీఆర్వో ప్రసాద్, డీటీ మునిశైలజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాషా, సి.రామాపురం విలేజ్ సర్వేయర్ హర్షవర్ధన్‌లకు ప్యాకేజీ మొత్తం ఆర్ఐ జీవన్ ద్వారా పంచి.. భూమిని కొల్లగొట్టాడని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. దీనిపై రెండేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా వారు విచారణ జరపడం లేదని వాపోయారు. ఆర్డీవో కార్యాలయంలో విచారణ జరపకుండా కొందరు సిబ్బంది అడ్డుపడుతున్నారని, భూ కుంభకోణానికి బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకుని, 10 సెంట్ల భూమిని తిరిగి తన ఖాతాలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని బాధితుడు కోరుతున్నారు.



ఆర్సీపురం మండలంలోని భూమి

ప్రాణం తీసిన గాలి..దుమ్ము

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన రామ్ చరణ్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్,జూలై28: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు చింతలవీధికి చెందిన సురేష్ కుమారుడు రామ్‌చరణ్(17)మదనపల్లెలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆడికృత్తిక మాసం సందర్భంగా పుంగనూరు మండలం నెక్కొంది కొండపై వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి స్నేహితులైన సందీప్, ప్రదీప్‌తో కలసి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. దర్శనం తర్వాత తిరిగి వస్తుండగా బండ్లపల్లె క్రాస్ వద్ద విపరీతమైన గాలికి కంట్లో దుమ్ముపడి ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్‌స్తంభానికి ఢీకొంది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక ఉన్న సందీప్, ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రామ్‌చరణ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు





చంద్రశేఖర్ మృతదేహం, మృతుడి ఓటరు గుర్తింపు కార్డు

గుడిపాల, జూలై 28: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రం గా గాయపడ్డారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ కథనం మేరకు గుడిపాల నుంచి చిత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై కట్టకిందపల్లి దళితవాడకు చెందిన చంద్రశేఖర్, అరుల్‌పురానికి చెందిన దినకర్ వస్తున్నారు. చిత్తూరు నుంచి వేలూరు వైపు వెళ్తున్న కారు లక్ష్మీపురం వద్ద వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దినకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 28: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడు తిరుత్తణితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం సోమ, మంగళవారాల్లో తిరుపతి-తిరుత్తణి వయా నగరి మీదుగా, పచ్చికాపల్లం-తిరుత్తణి వయా కె.నగరం 20, పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, నగరి-తిరుత్తణి 5, కొత్తపల్లెమిట్ట-తిరుత్తణి వయా నగరి 15, పుత్తూరు వయా పల్లెపట్టు 6, సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 15, నాగులాపురం-తిరుత్తణి 5, తిరుపతి-పాకాల 5 బస్సులు నడవనున్నాయి.

భక్త జనసంద్రంగా బోయకొండ





అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు, కొండపైకి వెళ్లే మార్గంలో నిలిచి పోయిన కార్లు



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూలై28: బోయకొండ గంగమ్మ ఆదివారం భక్తులతో భక్త జనసంద్రంగా మారింది. ఆషాడ మాసం నాలుగో ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి 2 గంటల సమయం క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొండపై నుంచి కొండ కింద వరకు రెండు కిలోమీటర్ల పొడవునా కార్లు నిలిచిపోవటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్గాగా కుంట కబ్జా

వైసీపీ నేత చెరలో బాలేకుంట

మామిడి, టెంకాయ, జామ సాగు

మూగజీవాలకు తీరని దాహార్తి

పుంగనూరు, జూలై 26 : అధికారంలో ఉండగా కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లు వ్యవహరించారు వైసీపీ నేతలు. చెరువులు, కుంటలు, పొలాలు ఇలా ఏది ఖాళీగా కనిపిస్తే అక్కడ పాగా వేసేశారు. ఇందులో భాగంగా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ సర్వేనెంబరు 476లో 7-86 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాలేకుంటను వైసీపీ నేత కృష్ణారెడ్డి ఆక్రమించాడు. కుంటలో నీరు నిల్వ చేరకుండా చేసి, మామిడి, జామ, టెంకాయ చెట్లు పెట్టాడు. భూములకు, పశువులకు, జీవాలకు ఆ కుంట ఎంతో ఉపయోగంగా ఉండేదని, దాన్ని ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నారని గ్రామస్తులు, రైతులు పలు పర్యాయాలు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కుంటలో గతంలో వేసిన తాగునీటి బోరును, పైపులైన్‌ను వాడుకుంటున్నాడని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సమస్య ఉన్నా బోరు నుంచి నీరు ఇవ్వడంలేదని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి, కుంట కట్ట తెంచేశారని వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే కొడవళ్లతో దాడి చేయడానికి వస్తున్నారన్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి బాలేకుంటను రక్షించాలని కోరుతున్నారు.



బాలేకుంటలో వైసీపీ నేతలు నాటిన మామిడి మొక్కలు

ప్లాస్టిక్ రహిత వర్సిటీగా మారుస్తాం

ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28: ఎస్వీయూను ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి ప్రయత్నిస్తామని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆదివారం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వీరిని ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అభినందించారు. అనంతరం భూపతి నాయుడు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు జీవుల మనుగడకు అవరోధమన్నారు. పర్యావరణానికి కూడా ఎక్కువ హాని కలుగచేస్తాయని చెప్పారు. క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వేమూరి జయరాం ప్రసాద్, సభ్యుడు శివాజీ, సామాజిక కార్యకర్తలు మార్కండేయ, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), జూలై 28: స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ఆదివారం 24వ చిత్తూరు జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 బాలబాలికల సబ్ జూనియర్, ఓపెన్ క్యాడెట్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి శంకర్‌యాదవ్ హాజరై క్రీడాకారులకు విలువైన సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. జయరామయ్య, విజయ్‌కుమారి, క్రాంతికుమార్, మనోహర్ నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏర్పాటు



చిత్తూరు, జూలై 28: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడతామని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. ఆదివారం సంఘ కార్యాలయంలో చిత్తూరు తాలూకా ఎన్నికలు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను బహిష్కరించారంటూ ఆస్కార్‌రావు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. తాలూకా సంఘం అధ్యక్షుడిగా మోహన్, సెక్రటరీగా పయణి, కోశాధికారిగా దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రమీల, ఉపాధ్యక్షులుగా రవికుమార్, కిశోర్, సౌజన్య, విజయభాస్కర్, హైందవి, వేణుగోపాల్, సరితను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా ప్రియ, కవిత, మధు, వెంకటపతి నాయుడు, హరీష్‌కుమార్, ప్రసాద్, దిలీప్‌కుమార్, ఆరనైజింగ్ సెక్రటరీగా ముకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు ఎన్నికల అధికారి నరేష్‌బాబు తెలిపారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం



రామకుప్పం, జులై 28: ఇటీవల హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన శరత్ కుమార్‌ను ఆదివారం రామ కుప్పం టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కుప్పం మండలం అడవిబూదుగూరులో ఆయనను టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్ నేతలు సత్తి మహేంద్ర నాయుడు ఆయన స్వగృహంలో కలిశారు. దుశ్శాలువ, పూలమాలతో సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గుడుపల్లె, జులై 28: మండల పరిధిలోని గుడివంక కొండపై ఉన్న వళ్లీ దేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కుప్పం పీఆర్‌డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 235 మంది భక్తులకు వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ సురేష్, డాక్టర్ హేమంత్ నాయుడు ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామకుప్పం, జులై 28: రామకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న వారు పరస్పరం యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను వారు సన్మానించారు.

సమస్యల వలయంలో సదుం బస్టాండు



సదుం, జూలై 28: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. తాగేందుకు మంచి నీటి వసతి లేదు. మినరల్ వాటర్ ప్లాంటు అలంకారప్రాయంగా ఉంది. బస్టాండులోని మరుగుదొడ్ల ఎదుట ఖాళీ మందు సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు పేరుకుపోయాయి. బస్టాండులో ప్రైవేటు వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా ఉంది. ఆర్టీసీ బస్సులు ఆపేందుకు స్థలం లేని పరిస్థితి ఉంది. ఇక బస్టాండ్ కుడి ఎడమల మలు వులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మలుపుల వద్ద తోపుడు బండ్లు, దుకాణాల ముందు రోడ్డును ఆక్రమిస్తూ రేకుల షెడ్లులు, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్‌లు, వాహన చోదకులకు, పాదచారులకు, పిల్లలకు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించిన షెడ్లను తొలగించాలని, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని, మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం



యాదమరి, జూలై 28: కాశిరాలలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఘనంగా ముగిసింది. గత 18 రోజులుగా మహాభారత యజ్ఞం ముగింపు రోజైన ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. చుట్టు పక్కలా గ్రామాల నుంచే కాకుండా పరదరామి నుంచి కూడా ప్రజలు హాజరయ్యారు. దుర్యోధన వేషధారి ఆకట్టుకున్నారు.

ఓటమి చెందినా జగన్ తీరులో మార్పులేదు :టీడీపీ



మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై 28: ఓటమి చెందినా మాజీ సీఎం జగన్ తీరులో మార్పులేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అరాచక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదాకోసం హైకోర్టును ఆశ్రయించడం సిగ్గుచేటు అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టి, ఢిల్లీలో ధర్నా పేరుతో తపుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నా ప్రజలు నమ్మడంలేదన్నారు. జగన్ లాంటి నాయకుడు ప్రజా స్వామ్యానికి, రాష్ట్రానికి ప్రమాదమన్నారు. నేతలు మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

భూ ఆక్రమణపై కేసు నమోదు

సోమల, జూలై 28: సోమల మండలం కందూరుకు చెందిన చిత్తలూరి రమేశ్‌కు చెందిన భూమిని కొందరు ఆక్రమించారు. దీంతో ఆయన గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బోగస్ పత్రాలతో తన స్థలాన్ని ఆక్రమించి మరికొందరికి అమ్మేశారని వాపోయారు. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాలతో సోమల పోలీసులు అక్రమార్కులపై కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

సోమల, జూలై 28: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు.. మండలంలోని సూరయ్యగారిపల్లెకు చెందిన లలితకు అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం గుట్టపల్లెకు చెందిన నాగార్జునతో ఆరేళ్ల క్రిత్రం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కలిగారు. కొంత కాలంగా అదనపు కట్నం తీసుకు రావాలని అత్తింటివారు వేధించేవారు. వారి వేధింపులు తాళలేక పుట్టింటికి చేరుకున్న ఆమె సోమల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెద్దఉప్పరపల్లెలో గంగ జాతర

సోమల, జూలై 28: మండలంలోని పెద్దఉప్పరపల్లెలో ఆదివారం గంగజాతర వేడుకలు ప్రారంభ మయ్యాయి. గ్రామంలో పచ్చని తోరణాలు, విద్యుత్ అలంకరణలు చేపట్టారు. రాత్రి దిగువవీధిలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. పొలిమేర అమ్మవార్లకు మహిళలు బోనాలు, దీలు సమర్పించారు.

ఆడికృత్తిక ఆరంభం

సదుం, జూలై 28: స్థానిక గార్గేయ నది ఒడ్డున వెలసి ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరిగే మహోత్సవ కార్యక్రమంలో తొలిరోజున ధ్వజారోహణంతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

శెట్టిపల్లెలో అక్కగార్లకు విశేష పూజలు



బైరెడ్డిపల్లె, జూలై 28 : మండలంలోని శెట్టిపల్లె గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన అక్కగార్లదేవతలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విచ్చేసినవారికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు తీర్థంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

బైరెడ్డిపల్లె, జూలై 28 : మండలంలోని తీర్థం గ్రామంలో సోమవారం నాయీ బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం త్యాగరాజ స్వామి వారికి పూజలు, గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసులచే నాదస్వరకచ్చేరి జరుగుతుందని తెలియజేశారు.

నేడు ఆడికృత్తిక వేడుకలు

రామకుప్పం, జులై 28: మండలంలోని బల్ల పంచాయతీ పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయంలో సోమవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహిం చనున్నట్లు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం తెలిపారు. వేడుకల ప్రచార రథాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం తెల్లావారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేక, పూజలు నిర్వ హించి వేడుకలకు అంకురార్పణ చేపట్టనున్నట్లు వివరించారు.

60 వసంతాల అ'పూర్వ' కలయిక



చౌడేపల్లె, జూలై28: స్థానిక హైస్కూల్లో 1965-66 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక విజయవాణి స్కూల్లో కలిశారు. 75 ఏళ్ల వయస్సులో చిన్ననాటి ముచ్చట్లతో మురిసిపోయారు. ఒకరినొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

బాలమురుగన్‌కు ఆడిపూజలు





ప్రత్యేక అలంకరణలో బాలమురుగన్ స్వామి, దవడకు శూలం గుచ్చుకొని వస్తున్న భక్తుడు



బాలమురుగన్ ఉత్సవం ఊరేగింపు



కావళ్లు మోస్తూ వస్తున్న భక్తులు

గుడుపల్లె, జులై 28: మండల పరిధిలోని యామిగానిపల్లె బాలమురుగన్ స్వామి ఆలయంలో ఆడి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వీపునకు ఇనుప కొక్కిలు గుచ్చుకొని తేరును లాగారు. కావళ్లు మోస్తూ, దవడకు శూలం గుచ్చుకొని, శరీరానికి నిమ్మపండును గుచ్చుకొని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో బాలమురుగన్ ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవర్ల ఆలయ వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు బాలమురుగన్ దర్శించుకొనేందుకు వచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి వెండి ఆభరణాల వితరణ



వెండి అభరణాలు బహూకరిస్తున్న రెడ్డిప్రసాద్, రమేష్

పుంగనూరు రూరల్, జూలై 28: పుంగనూరు నగిరివీధిలో వెలసిన ప్రసన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి ఆదివారం దాతలు వెండి ఆభరణాలు వితరణ చేశారు. పట్టణానికి చెందిన రవి స్వీట్‌స్టాల్ యజమాని రవి 1.50 కిలోల వెండి కిరీటాన్ని అందజేశారు. అలాగే చింతపండు వ్యాపారి రమేశ్ మొదలియార్ కిలో వెండితో స్వామివారికి ముఖావళి సమర్పించారు. వెండి ఆభరణాలను ఆలయ అర్చకులు విశ్వేశ్వరయ్య, సోమేశ్వరయ్య, నాగేంద్ర, ప్రదీప్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశ్వర్థనారాయణశెట్టి, మునిస్వామి మొదలియార్, నాగరాజ, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు, జూలై 28: పుంగనూరు సమీపంలోని రాంపల్లె వద్ద గల వెంచర్‌కు నిర్మించిన ప్రహరీని శనివారం రాత్రి కొందరు కూల్చివేశారని బాధితుడు రమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత ఏడాది డిసెంబరు 15న కె.శివారెడ్డి, గుర్రప్ప, భారతమ్మల నుంచి 2.15 ఎకరాల భూమి కొనుగోలు చేసి చదును చేసి వెంచర్ వేసినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూజగానిపల్లెకు చెందిన ప్రదీప్, శాంతికుమార్, రవి ఈ భూమి తమదని తమ సంతకాలు లేకుండా ఎలా రిజిస్టర్ చేసుకుంటావని ప్రహరీ ధ్వంసం చేశారని ఆరోపించారు. కాగా ఈ విషయంపై ప్రదీప్ మాట్లాడుతూ సర్వేనెంబరు 392/2/3లోని తమ అనువంశిక భూమిని పీకేఎం ఉడా మాజీ చైర్మన్ ఎన్.వెంకటరెడ్డి యాదవ్ కబ్జా చేసి నాలుగేళ్లుగా బెదిరిస్తున్నట్లు వాపోయారు. గత ఏడాది 42/23 కోర్టు తనకు స్టేటస్‌కో, ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా వైసీపీ నేతలు వెంకటరెడ్డి యాదవ్, అతని అనుచరుడు బి.రమణలు లెక్కచేయలేదని పేర్కొన్నారు. తమను బెదిరించి లేఅవుట్ వేసి కబ్జా చేశారని తెలియజేశారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యుడి ఊంజల్ సేవ



గుడుపల్లె, జులై 28: మండల పరిధిలోని గుడివంక కొండపై వెల సిన వళ్లీ దేవసేన సమేత సుబ్ర హ్మణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఊంజల్ సేవ నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగుల రంగుల పుష్పాలతో స్వామిఅమ్మవార్లను అలంకరించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మయూర వాహనంపై అధిష్ఠించారు. ఆ తరువాత ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

కిక్కిరిసిన బంగారు తరుత్తణి

సోమల, జూలై 28: ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చండీహోమం, భరణీ హోమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కల్యాణ మంటపాన్ని సుందరంగా వివిధ పుష్పాలతో అలంకరించి స్వామి, అమ్మవార్లను మంటపంపై అధిష్ఠింపచేశారు. స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. వేద పండి తులు మంత్రోచ్చరణల నడుమ గణపతి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు పుష్పకావళ్లు సమర్పించారు. హరోహర నామసర్మణలతో ఆలయం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, పూల మురళీ కృష్ణ, శ్రీదేవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. రెడ్డిజనార్ధన్, పాగొండ వేణుగోపాల్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కన్నుల పండువగా కల్యాణం



చౌడేపల్లె, జూలై28: స్థానిక బజారువీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కొలువైన షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని వళ్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామిలకు వేదపండితులు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల అధ్వర్యంలో శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులకు కల్యాణోత్సవం తిలవకించారు.

అబాకస్‌లో విద్యార్థుల సత్తా



బహుమతి అందుకున్న భార్గవ్

యాదమరి, జూలై 28: పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థి ఎస్. భార్గవ్ అబాకస్ పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర స్థాయి సిప్ అబాకస్‌లో నాలుగో లెవల్ రీజనల్ స్ట్రాటజీ చాంఫియన్ షిప్‌ను ఈ కుర్రాడు కైవసం చేసుకున్నారుడు. పాఠశాలో రెండో తరగతి విద్యార్థిని దీక్షిత రాష్ట్ర స్థాయి పోటీలో మూడవ రన్నరప్‌గా నిలిచింది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ కృష్ణబాబు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సిద్ధపూజ

సోమల, జూలై 28: మండలంలోని నడింపల్లె పంచాయతీ కరకమందలో ఎల్లమ్మదేవత కొలుపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సిద్ధపూజ ఘనంగా నిర్వహించారు. ఆసాది వారు ఎల్లమ్మదేవత జన్మచరిత్రను భక్తులకు వివరించారు. అమ్మవారిని పల్లకీలో అలంకరణ చేసి ఊరేగించారు. ఎల్లమ్మ దేవత వేషధారి, జపన్నలను గ్రామ వీధుల్లో ఊరేగించి ఆలయం నుంచి గ్రామ పొలిమేర్లలో రెండు రోజులుగా ఉపవాస దీక్షలో ఉన్న సిద్ధులను (చిన్నారులు) వద్దకు మంగళ వాయిద్యాలు, బాణసంచావేడుకలతో భక్తులు తరలివెళ్లారు. సిద్ధుల దీక్షను విరమింపజేసి వారిని దేవరింటి వద్దకు తీసుకొచ్చి మహిళలు పొంగళ్లు వండి ఫలహారం అందజేశారు. అదేసమయంలో గంగమ్మ ఆలయం వద్ద పలువురు మహిళలు వరపడ్డారు. అనంతరం దేవరింటి వద్దకు సిద్ధులు, ఎల్లమ్మ దేవత వేషధారి (చంద్రమౌళి) భక్తులతో కలసి ఊరేగింపుగా తరలివెళ్లారు. యువకులు కత్తి విన్యాసాలు భక్తులను రంజిప చేశాయి. కాగా కొలుపు ఉత్సవాల ఉభయదారులు ఎం. మునిరాజ, వంశీప్రియ, ఆదెమ్మ కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సోమల, నడింపల్లె, సదుం, సూరయ్యగారిపల్లె, అడుసుపల్లె, దాసరివారిపల్లె, అగ్రహారం తదితర గ్రామాల ప్రజలు భారీగా జాతరకు తరలివచ్చారు.







అమ్మవారికి పూజలు, ఎల్లమ్మదేవత వేషధారి వద్ద వరపడుతున్న భక్తులు, యువకుల కత్తివిన్యాసాలు

ఈ సారైనా నాణ్యత పాటిస్తారా..?

పలమనేరు, జూలై28 : కౌండిన్య నదిపై ఈసారైనా నాణ్యమైన చెక్ డ్యామ్‌లు నిర్మించాలని కౌండిన్య పరీవాహక రైతాంగం కోరుతున్నారు. కౌండిన్య నది పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా ప్రవహించి తమిళనాడుకు సాగుతోంది. వర్షాకాలంలో ఏటా దాదాపు రెండు నెలల పాటు ఈ కౌండిన్యనదిలో నీటి ప్రవాహం కొనసాగుతూ ఉంటుంది. ఈ నదిపై చెక్‌డ్యామ్‌లు ఉండడం వల్ల వర్షాకాలం ముగిసిన తరువాత కూడా పరీవాహక ప్రాంతంలో భూగర్భజలాలు సంవృద్ధిగా ఉంటాయి. దీంతో ప్రభుత్వాలు చెక్‌డ్యామ్‌లు నిర్మించాయి. అయితే కాంట్రాక్టర్లు నాశిరకంగా డ్యామ్‌లు నిర్మిస్తుండడంతో వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి. కోట్ల రూపాయల నిధులు నీటిపాలవుతున్నాయి. కాంట్రాక్టర్ల నుంచి నీటిపారుదల శాఖ అధికారులు ముడుపులు తీసుకుని నాశిరకమైన పనులకు సైతం బిల్లులు చేస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఓ వైపు ఆనందం.. మరోవైపు అనుమానం

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కలిసి కౌండిన్య నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్యనదిపై 16 చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ. 16.83 కోట్లు మంజూరు చేశారు. ఓపక్క నిధుల మంజూరుపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నా మరోపక్క నాణ్యతపై సందేహం వెలిబుచ్చు తున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రత్యేక శ్రద్ధతీసుకుని డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యతపాటించేలా చూడాలని కోరుతున్నారు. లేకపోతే మళ్లీ పాతకథే అవుతుందని పేర్కొంటున్నారు.





కుర్మాయి సమీపంలో వర్షాలకు కొట్టుకొని పోయిన చెక్‌డ్యామ్ ● గంగవరం మండలం కేటిల్‌ఫారం వద్ద దెబ్బతిన్న చెక్‌డ్యామ్

సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28: సచివాలయ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ అధికారులుగా నియమించి త్రిశంకుస్వర్గంలో వదిలేసిన వారికి డీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. గతంలో సచివాలయల్లో పేరుకే కార్యదర్శులుగా మిగిలిన గ్రేడ్-5 సచివాలయ కార్యదర్శులకు పూర్తి బాధ్యతలు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వీరిలో ఆనందాన్ని కలిగించింది. జిల్లాలో 247 సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా కల్పించినట్లయింది. పంచాయతీల్లో ఖర్చులు, ఉద్యోగుల జీతాలు అందించడానికి కార్యదర్శులకు స్వేచ్ఛ ఇచ్చినట్లయింది. సచివాలయ కార్యదర్శులు గుమస్తాలుగానే మొన్నటి వరకు పరిచేయాల్సి వచ్చింది. గ్రామంలో కచ్చా డ్రైన్ పూడిక తీయాలన్న ఆ సచివాలయానికి సమీపంలో ఉన్న గ్రేడ్-1 ఈవోల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ఎన్నికల ముందు డీడీవోలుగా పదోన్నతి ఇస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా జీవో ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావడంతో ఆ జీవో నీరుగారిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం వారికి ఉత్తర్వులు అందించింది.

షిర్డీ ఉచిత యాత్ర ప్రారంభం

చిత్తూరు కల్చరల్, జూలై 28: స్థానిక హైరోడ్డు పెట్రోల్ బంక్‌లో ఆదివారం ఎల్‌బీఐ షిర్డీ ఉచిత యాత్రను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో చేసే పనులకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌బీఐ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, కార్పొరేటర్ నవీన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గుడిపాల బాలాజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ ఏడాది 350 మంది భక్తుల యాత్రకు అన్నీ ఖర్చులు భరించి షిర్డీ పంపుతున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఉద్యోగుల సంఘం కార్యవర్గానికి ఎన్నిక



చిత్తూరు, జూలై 28: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడతామని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. ఆదివారం సంఘ కార్యాలయంలో చిత్తూరు తాలూకా ఎన్నికలు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను బహిష్కరించారంటూ ఆస్కార్‌రావు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. తాలూకా సంఘం అధ్యక్షుడిగా మోహన్, సెక్రటరీగా పయణి, కోశాధికారిగా దుర్గా ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రమీల, ఉపాధ్యక్షులుగా రవికుమార్, కిశోర్, సౌజన్య, విజయభాస్కర్, హైందవి, వేణుగోపాల్, సరితను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా ప్రియ, కవిత, మధు, వెంకటపతి నాయుడు, హరీష్‌కుమార్, ప్రసాద్, దిలీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు ఎన్నికల అధికారి నరేష్‌బాబు తెలిపారు.

వాహనాల్లో రికార్డులు తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న జయప్ప

విజయపురం, జూలై 28: వాహనాల్లో రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఎస్ఐ జయప్ప తెలిపారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ దరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలను తరలించకూడదన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మరు పాడై తాగునీటికి అవస్థలు



కార్వేటినగరం, జూలై 28: టీకేఎం పేట పంచాయితీ పరిధిలోని రాజుల కండ్రిగలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ నాలుగు రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో స్థానిక ప్రజలు తాగునీటికి నానావస్థలు పడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి తీసుకువెళ్లామని స్థానికులు చెప్పారు. తక్షణమే విద్యుత్ శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

30న ఆడికృత్తిక మహోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, జూలై 28: స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి ఈనెల 30న ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కాళభైరవట్రస్టు వ్యవస్థాపకులు వెంకటేష్, అర్చకులు శివాచార్యులు ఆదివారం తెలిపారు. స్వామివారికి అభిషేకం, అలంకరణ, మహాహరతి, తీర్థ ప్రసాద వితరణ, ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరాలకు విశేష స్పందన



చిత్తూరు కల్చరల్, జూలై 28: స్థానిక రాములవారిగుడి వీధిలోని జైన్ ప్రార్థన మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి విశేష స్పందన లభించింది. 179 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. 98 మందికి తిరుపతి అరవింద నేత్ర వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సంఘం అధ్యక్షులు సుభాష్‌జైన్ తెలిపారు. సద్గురు ఆశ్రమంలో వృద్ధులకు ఆశ్రమ నిర్వాహకులు ఉచిత నేత్రవైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్ జైన్లు, తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి ఊరేగింపు



కార్వేటినగరం, జూలై 28: స్థానిక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా ఆదివారం గ్రామ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో కృష్ణనాయక్, రవియాదవ్ పాల్గొన్నారు.

చిట్టిబాబుకు ఎమ్మెల్యే థామస్ శుభాకాంక్షలు



పాలసముద్రం, జూలై 28: రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం పాలసముద్రంలో నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొని శాలువ కప్పి సన్మానించి, బొకే అందజేశారు. ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేశారు. నాయకులు వాసు నాయుడు,శేఖర్ రాజు, విజయ్ కుమార్, రవి నాయుడు, వాసు యాదవ్‌పాల్గొన్నారు.

కుంటను ఆక్రమించుకుంటున్నా పట్టదా..



కుంట కట్టపై షెడ్డు నిర్మాణం

పాలసముద్రం, జూలై 28: తమను ఓ వ్యక్తి మోసం చేశారని కోదండరామాపురం వాసులు వాపోతున్నారు. వారి కథనం ప్రకారం వివరాలు ఇలా.. కోదండరామాపురంలోని జీవాలగుంట కట్టమీద నరసింహాపురం పంచాయతీ అయ్యవారికండ్రిగ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి రెండేళ్ల క్రితం షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. మూడు నెలల తర్వాత వేరే ప్రాంతంలో స్థలం కొనుగోలు చేసి వెళ్ళిపోతానని గ్రామస్థులతో ఒప్పందం చేసుకున్నాడు. ఈ కుంట సర్వే నెంబరు 9/1లో 1.10 ఎకరాలున్నాయి. ప్రస్తుతం కృష్ణారెడ్డి జేసీబీలతో కుంటలో మట్టి తోలి కొంత పూడ్చేశారు. గ్రామస్థులు ప్రశ్నించడంతో నలుగురికి నోటీసులు పంపాడు. పశువులు, మేకలు, గొర్రెలు నీళ్ళు తాగే కుంటను పూడ్చివేస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెండి ఆభరణాల వితరణ

పుంగనూరు రూరల్, జూలై 28: పుంగనూరు నగిరివీధిలో వెలసిన ప్రసన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి ఆదివారం దాతలు వెండి ఆభరణాలు వితరణ చేశారు. పట్టణానికి చెందిన రవి స్వీట్‌స్టాల్ యజమాని రవి 1.50 కిలోల వెండి కిరీటాన్ని అందజేశారు. అలాగే చింత పండు వ్యాపారి రమేశ్ మొదలియార్ కిలో వెండితో స్వామివారికి ముఖావళి సమర్పించారు. వెండి ఆభరణాలను ఆలయ అర్చకులు విశ్వేశ్వరయ్య, సోమేశ్వరయ్య, నాగేంద్ర, ప్రదీప్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆశ్వర్థనారాయణశెట్టి, మునిస్వామిమొదలియార్, నాగరాజ, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఫ్లైఓవర్‌పై గడ్డర్ ఏర్పాటు



చిత్తూరు సిటీ, జూలై 28: కలెక్టరేట్ వద్ద నిర్మిస్తున్న ఎన్‌హెచ్ ఫ్లైఓవర్‌పై గడ్డర్‌ను ఏర్పాటు చేశారు. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌పై ఆదివారం భారీ క్రేన్ సహాయంతో వంతెనపై గడ్డర్లను అమర్చారు. ఈ సందర్భంగా కొంతసేపు ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

షిర్డీ ఉచిత యాత్ర ప్రారంభం



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కల్చరల్, జూలై 28: స్థానిక హైరోడ్డు పెట్రోల్ బంక్‌లో ఆదివారం ఎల్‌బీఐ షిర్డీ ఉచిత యాత్రను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో చేసే పనులకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌బీఐ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, కార్పొరేటర్ నవీన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గుడిపాల బాలాజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ ఏడాది 350 మంది భక్తుల యాత్రకు అన్నీ ఖర్చులు భరించి షిర్డీ పంపుతున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

ఆడిమాస ఉత్సవాల కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులతో ఈఓ రామచంద్రారెడ్డి తదితరులు

నగరి జూలై28:టీఆర్‌కండ్రిగలోని దేశమ్మ దేవస్థానంలో ఆడిమాస ఉత్సవాల పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటుచేసినట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు.ఆదివారం కమిటీ సభ్యులు మురళిరెడ్డి, మదనకుమార్, సుబ్బయ్య వెంకటాచలం చౌదరి, బాధ్యతలు స్వీకరించారన్నారు. మరో సభ్యుడు వీకేఎస్ వాసు తర్వాత బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.గుడి మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూలో చేరిక



ఐఎఫ్‌టీయూ నాయకులతో చైతన్య

చిత్తూరు రూరల్, జూలై 28: సీపీఐ(ఎంఎల్)కు అనుబంధ కార్మిక సంస్థ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూలో సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి చైతన్య చేరారు. ఇటీవల సీఐటీయూ నుంచి బయటకు వచ్చిన ఆయన బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథ గృహంలో ఐఎఫ్‌టీయూ నాయకులు హరికృష్ణ, వెంకటరత్నంల సమక్షంలో చేరారు. ఆయనతో పాటు ఆరు యూనియన్‌ల నుంచి 50 మంది వరకు ఐఎఫ్‌టీయూలో చేరారు. వివిధ సంఘాల నాయకులు మోహన్, వెంకటేష్, అన్సర్, సురేష్, దినేష్, మైఖేల్, నవీన్, రాము, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

'నీరు'గారిన లక్ష్యం

● బంగారెడ్డిపల్లెలో శిథిలావస్థకు నీటిట్యాంకు
● పిల్లారికుప్పం,ఎల్లాపల్లెలో నిరుపయోగ నిర్మాణాలు

గంగాధరనెల్లూరు, జూలై 28: తమకు తాగు నీటి ట్యాంకుతో ముప్పు పొంచి ఉందని బంగారెడ్డి పల్లెవాసులు ఆందోళన చెందుతున్నారు. కూలి కోకముందే దానిని తొలగించాలని కోరుతున్నారు. గ్రామంలో సుమారు 19ఏళ్ల క్రితం ఈ తాగునీటి ట్యాంక్ నిర్మించారు. ట్యాంక్‌లోకి నీటిని పంపింగ్ చేసినపుడు చుట్టూ పైభాగంలో నుంచి నీటిలీకేజి అయ్యేది. దీంతో అధికారులు దానిని వాడకుండా తాత్కాలికంగా వదిలేశారు. అప్పటినుండి డైరక్ట్ పంపింగ్ ద్వారానే బోరు నుండి నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. దాని సమీపాన ఉంటున్నవారు ఆందోళన చెందుతున్నారు. ట్యాంక్ తొలగించాలని పదేపదే కోరుతున్నా స్పందించడం లేదని వీరంతా వాపోతున్నారు. తమ ఇళ్లపై కూలిపోయి పెద్దప్రమాదం జరగకముందే తొలగించాలని కోరుతున్నారు. ఎల్లాపల్లె దళితవాడలో సుమారు పదేళ్ళకిందట తాగునీటి ట్యాంక్ నిర్మించారు. అప్పటినుండి నిరుపయోగంగా ఉంది టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించారనే కారణంతో వినియోగించలేదనే విమర్శలు ఉన్నాయి. తూగుండ్రం పంచాయతీ పిళ్ళారికుప్పంలో సుమారు 17ఏళ్ళ కిందట తాగునీటి ట్యాంక్ నిర్మించారు. నీళ్ళు వదిలితే ట్యాంక్ ఉరుస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. అప్పటి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి లీకేజిని అరికడితే లక్షలాది రూపాయలతో నిర్మించిన ట్యాంక్ ఉపయోగపడేదని స్థానికులు చెబుతున్నారు.



బంగారెడ్డిపల్లెలో ప్రమాదకరంగా తాగునీటి ట్యాంక్- పిళ్ళారి కుప్పంలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంక్

భక్తిప్రపత్తులతో సుబ్రహ్మణ్యేశుడి భరణి ఉత్సవం



ఆలయ మెట్లోత్సవంలో భక్తులు - బొండువీథిలో కావళ్ల పూజలు - కావళ్ళతో తిరుత్తణికి బయలు దేరిన భక్తులు

చిత్తూరు కల్చరల్, జూలై 28: గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఆడికృత్తిక మహోత్సవాల్లో ఆదివారం స్వామివారికి భరణీ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ మెట్లకు భక్తులు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పూజలు చేశారు. మూలవర్లకు ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తలు పూల సుబ్రమణ్యంనాయుడు, డాక్టర్ ఎస్.టి. రంగనాథన్ దంపతులు భరణీ నక్షత్ర పూజలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు కావళ్ళను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దాతలు అన్న ప్రసాదాలు, తాగునీరు వితరణ చేశారు. బొండువీధివాసులు ఊరేగింపుగా వచ్చి కావళ్ళు సమర్పించారు. సోమ, మంగళవారాలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

ఓటమి చెందినా జగన్ తీరులో మార్పులేదు :టీడీపీ



మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై 28: ఓటమి చెందినా మాజీ సీఎం జగన్ తీరులో మార్పులేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అరాచక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రజలుతీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం హైకోర్టును ఆశ్రయించడం సిగ్గుచేటు అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టి, ఢిల్లీలో ధర్నా పేరుతో తపుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నా ప్రజలు నమ్మడంలేదన్నారు. జగన్ లాంటి నాయకుడు ప్రజాస్వామ్యానికి, రాష్ట్రానికి ప్రమాదమన్నారు. నేతలు మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం



యాదమరి, జూలై 28: కాశిరాలలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఘనంగా ముగిసింది. గత 18 రోజులుగా మహాభారత యజ్ఞం ముగింపు రోజైన ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. చుట్టుపక్కలా గ్రామాల నుంచే కాకుండా పరదరామి నుంచి కూడా ప్రజలు హాజరయ్యారు. దుర్యోధన వేషధారి ఆకట్టుకున్నారు.

తిరుపతికి దీటుగా విద్యుత్ ఆధునీకరణ :ట్రాన్స్‌కో ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, జూలై 28: తిరుపతికి దీటుగా కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ ఆధునీకరణ పనులు చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం చిత్తూరు ఆపరేషన్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అధికారులతో విద్యుత్ సరఫరా, ఇతర విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరింపేట 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల ఏర్పడితే నగరంలో ఎక్కువ శాతం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా సుమారు రూ.1.28 కోట్లతో దొడ్డిపల్లి నుంచి కట్టమంచి వరకు లైన్లు వేయనున్నట్లు తెలిపారు. మరో 20 ట్రాన్స్‌పార్మర్లు పెడుతున్నట్లు వివరించారు. కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈఈ మునిచంద్ర, డీఈలు పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఆపరేషన్ డివిజన్ కార్యాలయ భవనంతీరు పరిశీలించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు మృతి



విజయపురం, జూలై 28: జగన్నాథపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గ్రామంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల టీడీపీ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్రప్రసాద్ మృతికి మండల టీడీపీ నాయకులు రమేష్‌రాజు, బాబుయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, చుక్కా ధనుంజయయాదవ్, శివలింగం, దశరథరాజు సంతాపం వ్యక్తం చేశారు.

మోదీ సారథ్యంలో రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యం



భువనేశ్వరి

నింద్ర, జూలై 28: మోదీ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు భువనేశ్వరి చెప్పారు. ఆదివారం నింద్రలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు కురిపించడం ఆనందంగా ఉందన్నారు. ఏపీ పునర్నిర్మాణం నరేంద్రమోదీ నాయకత్వంలోనే సాధ్యమన్నారు.. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

అబాకస్‌లో విద్యార్థుల సత్తా



బహుమతి అందుకున్న భార్గవ్

యాదమరి, జూలై 28: పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థి ఎస్. భార్గవ్ అబాకస్ పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర స్థాయి సిప్ అబాకస్‌లో నాలుగో లెవల్ రీజనల్ స్ట్రాటజీ చాంపియన్ షిప్‌ను ఈ కుర్రాడు కైవసం చేసుకున్నారుడు. పాఠశాలో రెండో తరగతి విద్యార్థిని దీక్షిత రాష్ట్ర స్థాయి పోటీలో మూడవ రన్నరప్‌గా నిలిచింది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ కృష్ణబాబు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28: సచివాలయ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ అధికారులుగా నియమించి త్రిశంకుస్వర్గంలో వదిలేసిన వారికి డీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. గతంలో సచివాలయల్లో పేరుకే కార్యదర్శులుగా మిగిలిన గ్రేడ్-5 సచివాలయ కార్యదర్శులకు పూర్తి బాధ్యతలు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వీరిలో ఆనందాన్ని కలిగించింది. జిల్లాలో 247 సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా కల్పించినట్లయింది. పంచాయతీల్లో ఖర్చులు, ఉద్యోగుల జీతాలు అందించడానికి కార్యదర్శులకు స్వేచ్ఛ ఇచ్చినట్లయింది. సచివాలయ కార్యదర్శులు గుమస్తాలుగానే మొన్నటి వరకు పరిచేయాల్సి వచ్చింది. గ్రామంలో కచ్చా డ్రైన్ పూడిక తీయాలన్న ఆ సచివాలయానికి సమీపంలో ఉన్న గ్రేడ్-1 ఈవోల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ఎన్నికల ముందు డీడీవోలుగా పదోన్నతి ఇస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా జీవో ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావడంతో ఆ జీవో నీరు గారిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం వారికి ఉత్తర్వులు అందించింది.

కుమారస్వామికి వైభవంగా కావళ్ల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, జూలై 28: కందగిరికొండపై సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భరణి సందర్భంగా స్వామివారికి ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు., తీర్థ, ప్రసాదాలు అందజేశారు. సోమవారం కృత్తిక సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉదయం అభిషేకంలో పాల్గొంటారని సుబ్రహ్మణ్యం తెలిపారు. చిత్తపార, అడవిచేనులోని ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. **గంగాధరనెల్లూరు:** ఎట్టేరిలో సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పుష్ప కావళ్ల సమర్పించారు. **విజయపురం:** . కళియంబాకం, పన్నూరు, ఆమగుంట, తెల్లగుంట, విజయపురం, ఎం.అగరం, కేవీపురం, కాళికాపురం, ఆలపాకం గ్రామాల్లో కావడి తీశారు. రామగిరి, తిరుత్తణి సుబ్రహ్మణ్యంస్వామి ఆలయాలకు భక్తులు తరలివెళ్లారు.

ఈ సారైనా చెక్‌డ్యాముల్లో నాణ్యత పాటిస్తారా..?



కూర్మాయి సమీపంలో వర్షాలకు కొట్టుకొని పోయిన చెక్‌డ్యామ్

పలమనేరు, జూలై28 : కౌండిన్య నదిపై ఈసారైనా నాణ్యమైన చెక్ డ్యామ్‌లు నిర్మించాలని కౌండిన్య పరీవాహక రైతాంగం కోరుతున్నారు. కౌండిన్య నది పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా ప్రవహించి తమిళనాడుకు సాగుతోంది. వర్షాకాలంలో ఏటా దాదాపు రెండు నెలల పాటు ఈ కౌండిన్యనదిలో నీటి ప్రవాహం కొనసాగుతూ ఉంటుంది. ఈ నదిపై చెక్‌డ్యామ్‌లు ఉండడం వల్ల వర్షాకాలం ముగిసిన తరువాత కూడా పరీవాహక ప్రాంతంలో భూగర్భజలాలు సంవృద్ధిగా ఉంటాయి. దీంతో ప్రభుత్వాలు చెక్‌డ్యామ్‌లు నిర్మించాయి. అయితే కాంట్రాక్టర్లు నాశిరకంగా డ్యామ్‌లు నిర్మిస్తుండడంతో వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి. కోట్ల రూపాయల నిధులు నీటిపాలవుతున్నాయి. కాంట్రాక్టర్ల నుంచి నీటిపారుదల శాఖ అధికారులు ముడుపులు తీసుకుని నాశిరకమైన పనులకు సైతం బిల్లులు చేస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కలిసి కౌండిన్య నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే పలమనేరు నియోజక వర్గంలోని కౌండిన్యనదిపై 16 చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ. 16.83 కోట్లు మంజూరు చేశారు. ఓవక్క నిధుల మంజూరుపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నా మరోపక్క నాణ్యతపై సందేహం వెలిబుచ్చు తున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రత్యేక శ్రద్ధతీసుకుని డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యతపాటించేలా చూడాలని కోరుతున్నారు. లేకపోతే మళ్లీ పాతకథే అవుతుందని పేర్కొంటున్నారు.

చర్చి నిర్మాణానికి భూమిపూజ

బంగారుపాళ్యం, జూలై 28: నలగాంపల్లి పంచాయతీ పీడీపీ కండ్రిగలో ఆదివారం చర్చి నిర్మాణానికి వేలూరు డయాసిస్ పీఠాధిపతులు రెవరండ్ డాక్టర్ శర్మ నిత్యానందం, ఇమ్మానువేలు, ఎజెక్కేల్, సామువేలు బాబులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ షీబా స్వామిదాస్, సుధాకర్, మాజీ ఎంపీటీసీ గిరిబాబు సుజాత, సుందర్‌రాజ్, రామస్వామి, ఏసు పాల్గొన్నారు.

60 వసంతాల అ'పూర్వ' కలయిక



చౌడేపల్లె, జూలై28: స్థానిక హైస్కూల్లో 1965-66 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక విజయవాణి స్కూల్లో కలిశారు. 75 ఏళ్ల వయస్సులో చిన్ననాటి ముచ్చట్లతో మురిసిపోయారు. ఒకరినొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

భూ ఆక్రమణపై కేసు నమోదు

సోమల, జూలై 28: సోమల మండలం కందూరుకు చెందిన చిత్తలూరి రమేశ్‌కు చెందిన భూమిని కొందరు ఆక్రమించారు. దీంతో ఆయన గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బోగస్ పత్రాలతో తన స్థలాన్ని ఆక్రమించి మరికొందరికి అమ్మేశారని వాపోయారు. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాలతో సోమల పోలీసులు అక్రమార్కులపై కేసు నమోదు చేశారు.